క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని రాంపురంలో గల బీసీ గురుకుల బాలుర పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటప్పయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు బట్టు మధు, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథం, ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు రాములు, వెంకన్న, మహేష్, ప్రకాశ్, జయ, రజని, ఉపేందర్, రత్నం, అయోధ్య, ఖాసీం తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడవెండి వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా సోమవరపు వెంకటాచారిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లు నర్సింహాచారి, పరిపూర్ణాచారి, వీరనరేష్, ఓంకారం, రామయ్యాచారి, నరేష్, లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

నేడు బహిరంగ వేలం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల శ్రీసీతారామచంద్రస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయల అమ్ముకొనుటకు బహిరంగ వేలం పాట ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాట కాలపరిమితి ఈనెల 23 నుంచి 27 వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ



ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

కోదాడ : కోదాడలో సోమవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో కోదాడకు చెందిన జయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలను గెలుచుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం చిలువేరు వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు 28 మంది బంగారు పతకాలను గెలుచుకున్నారని, వీరిలో 12 మంది రెండో లెవల్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన

హుజూర్‌నగర్ : ఇటీవల మిర్యాలగూడలో నిర్వహించిన డివిజన్ పాఠశాల స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులను హెచ్‌ఎం పీవీ రమణారావు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు జూనియర్ బాలికల ఖోఖోలో ప్రథమ బహుమతి, సీనియర్ బాలుర ఖోఖోలో ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. 100 మీటర్స్ రిలే లో జూనియర్ బాలికలు, సీనియర్ బాలికలు ప్రథమ బహుమతి, జూనియర్ బాలురు ప్రథమ బహుమతి గెలుపొందినట్లు చెప్పారు. చెస్, క్యారమ్స్‌లలోనూ జూనియర్ సీనియర్ విభాగాల్లో బహుమతులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలి

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ కోరారు. మంగళవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహలు నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సీజ్ చేసిన వాహనాలపై పట్టింపేదీ!

- ఆర్టీసీ డిపోలో పేరుకుపోయిన పట్టుబడిన వాహనాలు
- తుప్పు పడుతున్నా పట్టించుకోని ఆర్టీఏ అధికారులు
- తొలగించాలని విజ్ఞప్తులు



కోదాడ ఆర్టీసీ డిపోలో కుప్పలుగా ఉన్న ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన వాహనాలు

కోదాడ : కోదాడ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సీజ్ చేసిన వాహనాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరిగే వాహనాలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేసి ఆర్టీసీ డిపోలో పెడుతున్నారు. వాటిని ఆయా వాహనాల యజమానులు తీసుకెళ్లకపోవడంతో అనేక సంవత్సరాలుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతున్నాయి. వీటిపై చెత్తచెదారం పడడంతో వచ్చే వేసవిలో అనుకోని ప్రమాదం జరిగితే తమకు ఇబ్బంది కలుగుతుందని, వాటిని వెంటనే తొలగించాలని ఆర్టీసీ అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

తుప్పు పట్టి.. చెట్లు పెరిగి

ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన వాహనాలను తగిన జరిమానా చెల్లించి తీసుకొని పోవాల్సి ఉంటుంది. కానీ వాహనం విలువ కన్నా అధికారులు విధించిన జరిమానా ఎక్కువగా ఉండడంతో యజమానులు వాటిని వదిలేసి వెళుతున్నారు. ఇలా అనేక సంవత్సరాలుగా అధికారులు సీజ్ చేసిన వందల వాహనాలు కోదాడ ఆర్టీసీ డిపోలో పడి ఉన్నాయి. వీటిపైన చెట్ల ఆకులు రాలిపడడంతో పాటు వాహనాలు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి. సీజ్ చేసిన ట్రాక్టర్లలో ఉన్న ఇసుక కూడా అలాగే ఉండడంతో వాటిలో చెట్లు పెరుగుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వేలం వేస్తే ఆదాయం..

ఆర్టీఏ అధికారులు సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ఆర్టీసీ అధికారులకు ఊరట కలుగుతుంది. కానీ ఆర్టీఏ అధికారులు మాత్రం అది తమ సమస్య కాదన్నట్లు వదిలేశారు. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు ఈ వాహనాల విషయంపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఆర్టీసీ సిబ్బంది కోరుతున్నారు.

త్వరలో వేలం వేస్తాం

"కోదాడ ఆర్టీసీ డిపోలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను తొలగించాలని డిపో మేనేజర్ లెటర్ పెట్టారు. దీంతో ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలో వీటి వేలానికి అనుమతి వస్తుంది. రాగానే వేలం వేసి తీసివేస్తాము.

– బాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కోదాడ

కోదాడకు చేరుకున్న దేవతామూర్తుల విగ్రహాలు



రాములవారి విగ్రహానికి జలావాసం చేస్తున్న భక్తులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో మార్చి 20న శ్రీకోదండరామస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా దేవతామూర్తుల విగ్రహాలు మంగళవారం సాయంత్రం కోదాడకు చేరుకున్నాయి. సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, సింహవాహనం తదితర విగ్రహాలను స్థానిక శ్రీరంగాపురం ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా పట్టణ ప్రధాన రహదారి గుండా నాగుబండి నగర్‌లోని విష్ణురామ్ థియేటర్‌కు చేర్చి భద్రపరిచారు. విగ్రహాలకు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నాగుబండి రంగా, రంగనాథ్, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు నారాయణరావు, సత్యనారాయణ, శ్రీధర్, చెన్నకేశవరావు, ప్రసాద్, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'మైహోం' సేవలు అభినందనీయం

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి. శ్రీనివాసరావు

మేళ్లచెరువు : మైహోం పరిశ్రమ సేవలు అభినందనీయమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని పరిశ్రమ హెడ్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశు వైద్య శిబిరాలను పశుపోషకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, శిబిరంలో పశువులు, పెంపుడు జంతువులు, కోళ్లకు వ్యాక్సిన్లు వేశారు. పశు వైద్య సిబ్బంది పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, గోవిందరెడ్డి,పరిశ్రమ జీఎం.నాగేశ్వరరావు, జగన్నాథరావు, రత్నం, ఏజీఎం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చిలుకూరు : ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రశాంతి

చిలుకూరు : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. మంగళవారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్యంపై మండల స్థాయిలో గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బుధవారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రూపేందర్‌సింగ్, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ ఇబ్రహీం, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, మండల స్థాయి అధికారులు, గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్రత్యేక పారిశుద్ధ్యం'

నేరేడుచర్ల : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 7వ తేదీ నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వీధులను శుభ్రం చేయడంతో పాటు గుంతలు పూడ్చడం, మురుగు కాలువల్లో పూడిక తీయడం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ కోరారు. మంగళవారం నడిగూడెం మండలంలోని ఎకలాస్‌ఖాన్‌పేటలో ఆర్థిక అక్షరాస్యత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి కె.లక్ష్మీనారాయణ, బి.గోపి, అంబేద్కర్, ముప్పవరపు కొండయ్య, ఎస్‌కె.లతీఫ్, బండారు శోభారాణి, చిలక బాలకృష్ణ, ఉపేందర్, రాజీవ్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి

గరిడేపల్లి : సాగర్ నీటిని ఆయకట్టు చివరి పొలాలకు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగర్ నీటిని మరో వారం రోజుల పాటు విడుదల చేయాలని కోరారు. సాగర్ నీరు ఆయకట్టు చివరి తూము వరకు వచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలను నీటితో నింపాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న బూరుగడ్డ గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం గ్రామంలో ఖాళీ బిందెలతో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం రాకముందే తాగునీటి ఎద్దడి ఏర్పడిందని వాపోయారు. గ్రామంలోని సత్తెమ్మ గుడి వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 6వ వార్డులోని ఎస్సీ కాలనీలో గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 6వ వార్డు ప్రజలు, ఎస్సీ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి జలాభిషేకం



రామాపురంలో ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి అభిషేకం చేస్తున్న నాయకులు

చిలుకూరు : సాగర్ నీరు విడుదల చేసి ఎండిపోతున్న పొలాలను కాపాడటాన్ని హర్షిస్తూ మంగళవారం చిలుకూరు మండలంలోని రామాపురం ఆర్‌కే మేజర్ కాలువలో మహాకూటమి ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్, పద్మావతి దంపతులకు పలువురు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, మహా కూటమి అధ్యక్షుడు వేమూరి నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, వేమూరి సురేష్, అమరగాని సైదులు, షేక్ పాషా, తిపిరిశెట్టి వీరయ్య, వేమూరి శ్రీను, వేమూరి నరసింహారావు, వేమూరి కృష్ణయ్య, మట్టయ్య, అప్పారావు, లింగయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు సహకరించాలి



హుజూర్‌నగర్ : గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బెల్లంకొండ గురవయ్య

హుజూర్‌నగర్ : సమ్మె నోటీసు అందుకున్న మిల్లుల యాజమాన్యాలు భారత్‌బంద్‌కు సహకరించాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో పార్ బాయిల్డ్ రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య ఆధ్వర్యంలో మిల్లుల ఆవరణలో కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆల్ ట్రేడ్ యూనియన్ జాతీయ నాయకుల పిలుపు మేరకు అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు చింతకాయల రాము, మేకపోతుల వీరబాబు, కాకిలేటి సుబ్బారావు, ఇంటి తిరుపయ్య, గడ్డం నాగరాజు, శీలం రాజు, చల్ల శ్రీను, బొడ్డు వీరయ్య, గుండెబోయిన శ్రీను, అమరబోయిన ప్రసాద్, కనకయ్య, రామారావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి

గరిడేపల్లి : బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్ అన్నారు. గరిడేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌కు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె నోటీస్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రమీలా, ఉమ, బువ్వమ్మ, సువర్ణ, పద్మ, భవాని, ప్రమీల, సైదమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె నోటీసు అందజేత

మఠంపల్లి : ఈనెల 16న దేశవ్యాప్తంగా అఖిల పక్ష కార్మిక సంఘాల ఐక్యవేదిక తలపెట్టిన కార్మికుల సమ్మెలో పాల్గొంటున్నట్లు మంగళవారం మఠంపల్లి పంచాయతీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్మియా మాట్లాడారు. కాగా భీల్యానాయక్‌తండా, వరదాపురంలలో కూడా కార్మికులు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మైసయ్య, రవి, నరేష్, రాజేష్, శ్రీను, మోతీలాల్, నీలావతి, సైదా, బూరి, బాబు, బొందయ్య, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

క్షేత్రపాలకుడికి వైభవంగా ఆకుపూజ



కోదాడరూరల్ : అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కృష్ణకుమారి శేషు దంపతులు



హుజూర్‌నగర్ రూరల్ : ఆంజనేయస్వామికి ఆకుపూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ధర్మకర్త సురభి కుషల్, పూర్ణ, కనకయ్య, గురవయ్య, ఆలయ సిబ్బంది, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు మందలపు కృష్ణకుమారిశేషు దంపతులు గ్రామస్తులతో కలిసి ఆకుపూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శెట్టి విజయ్‌భాస్కర్, పూర్ణ తదితరులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కోదాడ మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు, నారాయణరావు, కొల్లు వీరయ్యల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకుడు దేవరశెట్టి హనుమంతరావు, తిరుపతయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతగిరి : మండల పరిధిలోని గోండ్రియాల గ్రామం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అనంతగిరి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోండ్రియాల శివారులోని పాలేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కోదాడకు అక్రమంగా ఇసుక తలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట శివారులోని మున్నేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గోండ్రియాల మీదుగా కోదాడకు ఇసుకను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈమేరకు ట్రాక్టర్ డ్రైవర్లు నెల్లూరి నరేష్, రేకల వెంకటరమణపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

హుజూర్‌నగర్ : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున బ్లూకోర్టు సిబ్బంది వేపలసింగారం రోడ్డులో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కనిపీడు నుంచి హుజూర్‌నగర్ వైపు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నారు. టిప్పర్ డ్రైవర్ మలమెల నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆశా కార్యకర్తల వేతనం రూ.26 వేలకు పెంచాలి

మేళ్లచెరువు : ఆశా కార్యకర్తల వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. 60 మంది ఆశా కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కేవీ నుంచి సీఐటీయూలో చేరి నట్లు ఆయన తెలిపారు. యశోద, మల్లేశ్వరి, పద్మ, నాగమణి, మంగ ఉన్నారు.

చెన్నూరు అనసూయమ్మకు ఘన నివాళి



అనసూయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగన్నగౌడ్, సీనియర్ న్యాయవాదులు

మఠంపల్లి : ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అనువంశిక చైర్మన్ దివంగత చెన్నూరు నరసింహారావు సతీమణి, ప్రస్తుత అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌ల తల్లి అనసూయమ్మ వర్ధంతిని మంగళవారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జోనల్ మెంబర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, సీనియర్ న్యాయవాది నారప రాజు శ్రీనివాసరావులు హాజరై అనసూయమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టపల్లి పుణ్యక్షేత్రానికి ఖండాతర గుర్తింపు వచ్చేలా కృషి చేసిన చెన్నూరు నరసింహారావుకు అనసూయమ్మ వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఎల్ యూనియన్ అధ్యక్షుడు తూమాటి శ్రీనివాసాచార్యులు, వరప్రసాదరావు, సాయికుమార్, కనకాంబర్‌రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కేవీపీఎస్‌జిల్లా కార్యదర్శి కోట గోపి కోరారు. మంగళవారం మండలంలోని నర్సింహులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసించే విద్యార్థులకు గ్రామానికి చెందిన నందిపాటి శేఖర్ సహకారంతో ప్యాడ్లు, పెన్నులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్,, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపి, ప్రకాష్, గ్రామస్తులు సొమపంగు వెంకటేశ్వర్లు, సొంపంగు నర్సయ్య, మారం ఉదయమ్మ, పోకల గామయ్య, సొంపంగు రమేష్, వంశీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

30 మంది కిట్స్ విద్యార్థినులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో కిట్స్ కళాశాల అధ్యాపకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన అకాడమోర్ కంపెనీలో ప్లేస్‌మెంట్ దక్కినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నీలా సత్యనారాయణ తెలిపారు. గత జనవరి 31న కంపెనీ ప్రతినిధులు వర్చువల్‌గా నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో తమ కళాశాలకు చెందిన 30మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్వయిజర్ పోతుగంటి నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గాంధీ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ ఎజాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అల్లీపురం అంగన్‌వాడీలో 'పోషణ్ అభియాన్'



పాల్గొన్న అంగన్‌వాడీలు, తదితరులు

మఠంపల్లి : మండలంలోని అల్లీపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాల బాలికలకు పౌష్టికాహారం అందించారు. అదేవిధంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ మంజుల, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

రేపు కేవీకేలో యోగాపై అవగాహన

గరిడేపల్లి : గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలోని కేవీకేలో యోగా, ఆహారపు అలవాట్లపై ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఎన్‌సీ రంగాచార్యులు గురువారం అవగాహన కల్పిస్తారని శాస్త్రవేత్త సుగంధి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని మైత్రి ఉన్నత పాఠశాల విద్యార్థిని సంజన అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఉప్పల నర్సింహారావు, ప్రిన్సిపల్ ఉప్పల సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 9, 10, 12, 14 విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన సంజన 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం సాధించిందని తెలిపారు. విద్యార్థిని పీఈటీ అంజయ్య, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

గానుగబండ వాసికి డాక్టరేట్



శ్రీనుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న అధికారి

గరిడేపల్లి : గరిడేపల్లి మండల పరిధిలోని గానుగబండ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య గోనానాయక్ పర్యవేక్షణలో భిక్షుకుంట్ల వారి మౌఖిక సాహిత్యం –సంస్కృతి అనే అంశంపై శ్రీను పరిశోధన పూర్తి చేసి సమర్పించిన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యారులు, సంచారజాతుల సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ అభినందించారు.

మట్టపల్లిలో నిత్య కైంకర్యాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం నిత్యకైంకర్యాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.